సాక్షి యాదాద్రి భువనగిరి

గురువారం । 29 । మే । 2025



సరిహద్దు దాటొస్తున్న ఇసుక

ఆంధ్రాలో ఉచిత ఇసుక పథకం అమలవుతుండడంతో కొందరు దళారులు మిర్యాలగూడకు తెచ్చి అమ్ముతున్నారు.

- 8లో



బ్రిడ్జి సరే.. బీటీ రోడ్డేది?

బ్రిడ్జి పనులు పూర్తయినా ఇరువైపులా బీటీ రోడ్డు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో

గరిష్టం/కనిష్టం
33°/25°

వాతావరణం

మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

పోచంపల్లిలో ఆఫ్రికన్ కంటెంట్ క్రియేటర్లు



మధ్య, పశ్చిమ ఆఫ్రికన్ దేశాలకు చెందిన సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు బుధవారం భూదాన్‌పోచంపల్లిలో మగ్గం నేసి, రాట్నం వడికి సందడి చేశారు. టూరిజం పార్కు, హ్యాండ్లూమ్ యూనిట్ తో పాటు చేనేత వస్త్రాలను పరిశీలించారు.

- 8లో

మరిన్ని బీడు భూములకు గోదావరి జలాలు

రిజర్వాయర్‌గా మారనున్న గంధమల్ల చెరువు

- 6న శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మరికొన్ని అభివృద్ధి పనులకు కూడా..
- వాసాలమర్రి గ్రామ సమీపంలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు



సీఎం సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జిల్లా అధికారులు

సాక్షి,యాదాద్రి : ఆలేరు నియోజకవర్గ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న గంధమల్ల ప్రాజెక్టుకు మోక్షం కలగనుంది. వచ్చేనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అదేవిధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, యాదాద్రి మెడికల్ కళాశాల, వేద పాఠశాల, ఆర్‌అండ్‌బీ రోడ్లు, గోదాములు, మోటకొండూరు మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలతోపాటు ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాటు పనుల్లో యంత్రాంగం నిమగ్నమైంది.

సీఎంతోపాటు పలువురు మంత్రులు

సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా వాసాలమర్రి గ్రామ సమీపంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సీఎం రేవంత్‌రెడ్డిని మంగళవారం కలిసి కోరారు. స్పందించిన సీఎం ఆలేరు నియోజకవర్గ పర్యటన ఖరారు చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లు సీఎంతోపాటు హాజరు కానున్నారు.

ఒకే చోట అభివృద్ధి పనుల శిలాఫలకాల ఆవిష్కరణ

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఒకే చోట శిలాఫలకాలు ఆవిష్కరించనున్నారు. వాసాలమర్రి గ్రామం సమీపంలో స్థలాన్ని నిర్ణయించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి బుధవారం స్థల పరిశీలన చేశారు. సీఎం రాక సందర్భంగా పోలీస్ శాఖ ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది.

శంకుస్థాపన చేసే అభివృద్ధి పనుల వివరాలు

గంధమల్ల రిజర్వాయర్ (1.41 టీఎంసీలు)	రూ. 700 కోట్లు
ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్	రూ. 200 కోట్లు
యాదగిరిగుట్టలో మెడికల్ కళాశాల	రూ. 180 కోట్లు
యాదగిరిగుట్టలో వేద పాఠశాల	రూ. 25 కోట్లు
నియోజకవర్గంలోఆర్‌అండ్‌బీ రోడ్లు	రూ. 50 కోట్లు
కొలనుపాక, కాల్వపల్లి హైలెవల్ బ్రిడ్జీలు	రూ. 14.50 కోట్లు
దాతర్‌పల్లిలో వేర్ హౌజ్ గోదాములు	రూ. 15 కోట్లు
ఆలేరులో మార్కెట్ యార్డు గోదాములు	రూ. 15 కోట్లు
సీఆర్‌ఆర్, ఎంఆర్‌ఆర్ రోడ్లు	రూ. 30 కోట్లు
యాదగిరిగుట్ట టెంపుల్ అభివృద్ధి	రూ. 100 కోట్లు
మోటకొండూరులో ఎంపీపీ, తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణాలకు	రూ. 10 కోట్లు

ఆలేరు అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

తుర్కపల్లి: సీఎం రేవంత్ రెడ్డి ఆలేరు నియోజవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో వచ్చే నెల 6న నిర్వహించనున్న సీఎం సభ, సభాస్థలిలో హెలిపాడ్, పార్కింగ్, అభివృద్ధి పనుల శిలాఫలకాల ఏర్పాటు పనులను కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఆలేరు ప్రజల కల అయిన గంధమల్ల ప్రాజెక్టు నెరవేరబోతోందన్నారు. ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. 50వేల మందితో నిర్వహించే బహిరంగ సభలో నియోజకవర్గానికి మరికొన్ని వరాలు ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నారు.



జిల్లా వ్యవసాయాధికారితో నేడు ఫోన్ ఇన్

ఈసారి వర్షాలు ముందుగానే కురుస్తున్నందున ఆరుద్ర కార్తె కంటే ముందే పంటల సాగుకు సన్నద్ధం కావచ్చా.. పత్తి తదితర మెట్టపంటలు ఎప్పుడు వేసుకుంటే బాగుంటుంది. వానాకాలం వరినార్లు పోసుకునేందుకు అనువైన సమయం ఎప్పుడు.. విత్తనాల ఎంపికలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి.. నకిలీ విత్తనాలను ఎలా గుర్తుపట్టాలి.. తదితర సమాచారం రైతులు తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయాధికారితో 'సాక్షి' గురువారం ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది. రైతన్నలు నేరుగా వ్యవసాయాధికారికి ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

తేది. 29.05.2025 (గురువారం)
సమయం : ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ :
89777 56419

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : జిల్లాలో కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అనుసంధానంతో జిల్లాలోని ఎరువులు, విత్తన డీలర్లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులకు అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. ఎరువుల షాపుల యాజమానులు లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డీఏపీ, తదితర పురుగుల మందులు స్టాకులను పక్కాగా నిర్వహించాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రశీదులు ఇవ్వాలని సూచించారు. వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు రైతులతో సమన్వయం చేసుకుంటూ విత్తనాల కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం పట్టణంలోని సత్యసాయి ఫర్టిలైజర్స్ షాపును తనిఖీ చేశారు. రైతులకు విక్రయిస్తున్న కంపెనీ విత్తనాల వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్‌లో అవసరాలకు అనుగుణంగా వంట నూనెల ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని, ఎకరానికి రూ.50,918 వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. 2025–26కు సంబంధించి ఆయిల్ పామ్ విస్తరణ కింద 3500 ఎకరాలు భౌతిక లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందని, దీనిని చేరుకోవడానికి ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ, ఆయిల్ ఫెడ్ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం ఈ– పాస్ మిషన్లను డీలర్లకు అందజేశారు. ఆయిల్ పామ్ సాగు పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, ఏడీఏ నీలిమ, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

రుణ లక్ష్యం రూ.6,660.15కోట్లు

సాక్షి, యాదాద్రి : 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ హనుమంతరావు బుధవారం విడుదల చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో రూ.6,660.15 కోట్ల అంచనాతో రుణ ప్రణాళిక రూపొందించారు. రూ.5,334.80 కోట్లు (80.10%) ప్రాధాన్యత రంగాలకు కేటాయించగా, రూ.1,325.35 కోట్లు ఇతర రంగాలకు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.4,284.41కోట్లు (మొత్తం ప్రణాళికలో 64.31%), ఇందులో పంట రుణాలు: రూ. 2,391.28 కోట్లు, వ్యవసాయ టర్మ్ లోన్లు రూ. 1,599.67 కోట్లు ఉన్నాయి. సూక్ష్మ, చిన్న – మధ్య తరహా పరిశ్రమలకు రూ.902.67 కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాలకు రూ. 147.72 కోట్లు కేటాయించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున బ్యాంకు అధికారులు రైతులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఓ నాగిరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్ సుందర్, బీసీ వెల్ఫేర్ అధికారి యాదయ్య, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం రవీందర్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివరామకృష్ణ, ఆర్బీఐ ఏజీఎం లక్ష్మీశ్రావ్య, నాబార్డ్ ఏజీఎం వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

యాదగిరీశుడికి నిత్యపూజలు



నిత్యకల్యాణం జరిపిస్తున్న ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో బుధవారం నిత్య పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలను అర్చించారు. ఆలయ ప్రాకార మండపాల్లో నిత్యకల్యాణం, శ్రీ సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన చేపట్టారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నల్లగొండ: కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సంక్షేమ పథకాలు సామాన్యులు సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ డీఆర్డీఓ శేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని సురక్ష బీమా పథకం కింద ఖాతాదారుడు సంవత్సరానికి రూ.20 చెల్లిస్తే రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఖాతాదారులు 18 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు. ప్రధాని జీవన జ్యోతి బీమా పథకం కింద ఖాతాదారుడు సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే ఏడాది కాలానికి గాను రూ.2 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు.

వలస జీవుల వివరాల సేకరణ



- జిల్లాలో ఇతర రాష్ట్రాల వారి వివరాలపై ఆరా తీస్తున్న పోలీసు యంత్రాంగం
- ఆధార్‌కార్డు, సెల్‌నంబర్ల సమాచారం సేకరణ

సేఫ్ అండ్ సెక్యూరిటీ కోసమే..



జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలు సేకరిస్తున్నది నిజమే. జవాబుదారీతనంతోపాటు సేఫ్ అండ్ సెక్యూరిటీలో భాగంగా ఈ వివరాలు సేకరిస్తున్నాం. సున్నితమైన ఘటనలు, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు, లేదా ఎవరైనా మృతి చెందినప్పుడు వారి గురించి అవసరమైన అదనపు సమాచారం తెలుసుకోవడానికి ఈ వివరాలు దోహదపడతాయి.

– ఆక్షాంశ్‌యాదవ్, డీసీపీ, భువనగిరి

ఆలేరు: జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. వ్యాపారం, వాణిజ్య పరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న యాదాద్రి భువనగిరి జిల్లాకు ఇతర రాష్ట్రాలకు చెందిన వందలాది మంది వలస వస్తున్నారు. వ్యాపార నిమిత్తం కొందరు, జీవనోపాధి కోసం మరికొందరు వచ్చి వివిధ ప్రాంతాల్లో తిష్ట వేస్తున్నారు. కొందరు సరైన పత్రాలు లేకుండా ఇక్కడ ఉంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనేపథ్యంలో భద్రతా అంశాల పరంగా పోలీసులు అలాంటి వారిపై దృష్టి సారించారు. ఈ మేరకు బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, కేరళ, తమిళనాడు ఇతర రాష్ట్రాలకు చెందిన వలస జీవులు జిల్లాలో ఎంతమంది ఉన్నారనే కోణంలో కూపీ లాగుతున్నారు. వారి నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

వివరాల సేకరణకు ఇదొక కారణం

భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో రోహింగ్యాలు ఎవరైనా ఉన్నారా? అనే సందేహాల్లో భాగంగా అధికారులకు ఫిర్యాదులు వెళ్లడం కూడా పోలీసుల వివరాల సేకరణకు ఒక కారణమని తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లాలోని భువనగిరి, యాదాద్రి, చౌటుప్పల్ పోలీసు డివిజన్లలో 19 పోలీస్‌స్టేషన్లు ఉండగా.. ఆయా ఠాణాల పరిధిలో ఏయే రాష్ట్రాలకు చెందిన వారు ఎంతమంది ఉంటున్నారనే వివరాల సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు.

వివరాల నిర్ధారణ

ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తుల ఆధార్‌కార్డు, సెల్ నంబర్లు తదితర పూర్తి సమాచారం పోలీసులు సేకరిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా వారు వాస్తవానికి అదే రాష్ట్రానికి చెందిన వారేనా? ఆధార్ కార్డు ఒరిజినలా.. కాదా? అని పోలీసులు నిర్ధారించుకుంటున్నారు. వారు ప్రధానంగా ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారు. ఎంత మంది ఇక్కడికి వచ్చారు. స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారా.. ఎన్ని నెలలకు వారి సొంత రాష్ట్రాలకు వెళ్లి, మళ్లీ ఎప్పుడు తిరిగి వస్తున్నారు. ఎంత కాలం నుంచి ఇక్కడ ఉంటున్నారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే తదుపరి చర్యలపై పోలీసులు దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

- డీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి : మానవ అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత అని డీఈఓ సత్యనారాయణ అన్నారు. మానవ అక్రమ రవాణాపై బుధవారం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో జిల్లాలోని కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2,920 మంది యువతులను అక్రమ రవాణా నుంచి కాపాడినట్లు చెప్పారు. ప్రమాదకర సమయాల్లో 1930 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ శ్రీనివాస్ చారి, జాయింట్ డైరెక్టర్ దుర్గాప్రసాద్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ మంజరి, కోర్సు కో ఆర్డినేటర్ యేమియా, ప్రజ్వల ఎస్పీఎం చంద్రయ్య, ఎన్జీఓ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి, చెన్న కేశవులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



సమావేశానికి హాజరైన అధికారులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్ ఆవరణలో జూన్ 2న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, డీఆర్డీఓ నాగిరెడ్డి, కలెక్టరేట్ ఏఓ జగన్మోహన్ ప్రసాద్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం అమలుపై సమీక్ష

రాజీవ్ యువ వికాసం అమలుపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ కృష్ణారావు హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ యవ వికాసం పథకం అమలుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలను అధికారులకు వివరించారు. కలెక్టర్ హనుమంత రావు, జెడ్పీ సీఈఓ శోభారాణి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి శేఖర్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

పనులు పూర్తిచేయాలి

భువనగిరిటౌన్ : ఉపాధి హామీ పథకం, స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమాల అమలుపై పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద నూతనంగా నిర్మించాల్సిన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల పనుల గుర్తింపు ప్రక్రియపై సమీక్షించారు. జెడ్పీ సీఈఓ శోభారాణి , జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సునంద, పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు

- పీఎం స్వనిధి యోజన కింద రుణాలు తీసుకుని చెల్లించిన వారికి అందజేత
- లబ్ధిపొందనున్న 7,168 మంది వీధి వ్యాపారులు



భువనగిరిలో వీధి వ్యాపారులు

భువనగిరి: వీధి వ్యాపారులకు ఆర్థికంగా చేయూత నివ్వాలనే ఉద్దేశంతో కరోనా పరిస్థితుల అనంతరం కేంద్ర ప్రభుత్వం 2020 జూన్‌లో ప్రధాన మంత్రి ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వనిధి యోజన) పథకాన్ని తీసుకువచ్చింది. మూడు విడతల్లో వ్యాపారులకు తక్కువ వడ్డీతో బ్యాంకుల ద్వారా స్వల్పకాలిక రుణాలు అందజేసింది. ఐదేళ్లు పూర్తి కావడంతో ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తిగా నిలిపివేసింది. అయితే రుణం తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి కొత్తగా క్రెడిట్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

జిల్లాలో 9119 మంది వీధి వ్యాపారులు

జిల్లా వ్యాప్తంగా భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, యాదగిరిగుట్ట, పోచంపల్లి, మోత్కూర్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఆయా మున్సిపాలిటీల్లో 9,119 మంది వీధి వ్యాపారులు ఉన్నట్లు గుర్తించారు. ఎంపిక చేసిన వ్యాపారులకు మొదటి విడత కింద రూ.10వేలు, రెండో విడత కింద రూ. 20వేలు, మూడో విడతలో రూ.50వేల చొప్పున రుణాలు అందజేశారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల్లో గుర్తించిన వీధి వ్యాపారుల్లో 7,168 మంది లబ్ధిదారులకు రూ.20.09కోట్ల రుణాలు మంజూరు చేశారు.

రుణాలు పొందిన వారి వివరాలు (రూ. కోట్లలో)

విడత	వీధి వ్యాపారులు	పంపిణీ
మొదటి	7,168	7.16
రెండో	4,134	8.26
మూడవ	1,133	5.66

సకాలంలో చెల్లించిన వారికి ఉపయోగం

ఎక్కువ వేతనంతో ఉద్యోగంతో పాటు సిబిల్ స్కోర్ ఉన్న వారికే బ్యాంకులు క్రెడిట్ కార్డులు మంజూరు చేస్తాయి. కానీ వీధి వ్యాపారులకు ఎలాంటి నిబంధన లేకుండానే రూ.30వేల నుంచి రూ.50వేల పరిమితితో కార్డులు అందజేయనున్నారు. ఈ పథకంలో భాగంలో గతంలో మూడు విడతల్లో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వ్యాపారులనే ఎంపిక చేయనున్నారు. క్రెడిట్ కార్డులు పొందిన వారు అవసరం వచ్చినప్పుడు బ్యాంకులో నగదును డ్రా చేసుకునే అవకాశం ఉంటుంది. అవసరమైన వస్తువులను ఈ కార్డు ద్వారా కొనుగోలు చేసి వ్యాపారాన్ని మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంది. బిల్లు వచ్చాక నిర్ణీత కాలవ్యవధిలో చెల్లిస్తే వడ్డీ ఉండదు.

ఇంకా ఆదేశాలు రాలేదు

గతంలో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వీధి వ్యాపారులకు క్రెడిట్ కార్డులు మంజూరు చేసే ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ఉత్తర్వులు జారీ చేసిన అనంతరం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. గతంలో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లించిన వారికి ప్రయోజనం ఉంటుంది.

– రమేష్‌బాబు మెప్మా పీడీ

కార్యకర్తలు క్రియాశీలకంగా పనిచేయాలి



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలులో కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని, కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరిలోని ఓ హోటల్‌లో భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ పాలనను తలపించే విధంగా సీఎం రేవంతర్‌రెడ్డి పాలన కనిపిస్తుందన్నారు. ఆరు గ్యారంటీ పథకాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ సిద్ధాంతమన్నారు. పార్టీ నిర్మాణంలో క్షేత్ర స్థాయి నుంచి సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామన్నారు. జిల్లా అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా మండల స్థాయి నుంచి పీసీసీ దాకా కార్యవర్గాలను ఏర్పాటు చేసేందుకు అగ్రనాయకత్వం రూట్ మ్యాప్‌ను ఖరారు చేసిందని తెలిపారు. సీనియర్లకు ప్రాధాన్యం ఇస్తూనే మహిళలు, యువతకు పదవుల్లో పెద్దపీట వేయాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. ఇకపై పార్టీ కమిటీలే అన్ని నిర్ణయాల్లో కీలక పాత్ర వహిస్తాయన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పదేళ్లపాటు సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలకు, నాయకులకు పదవులు ఇవ్వాలని అధిష్టానం నిర్ణయించిందన్నారు. కాగా.. పార్టీ మండల అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు మాత్రమే మాట్లాడుతున్నారని, తమకు కూడా అవకాశం ఇవ్వాలని పలువురు కార్యాకర్తలు ఆందోళన చేశారు. వారిని సముదాయించడంతో సద్దుమణిగింది. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్‌చిస్తీ, సంస్థాగత ఎన్నికల కోఆర్డినేటర్లు ధనవంతి, డాక్టర్ పులి అనిల్, టీపీసీసీ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

మద్దిరాల: తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన మద్దిరాల మండలం పోలుమల్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలుమల్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు తునికి వెంకన్న రోజుమాదిరిగానే బుధవారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య తునికి లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ ఎం.వీరన్న తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కనగల్, రామగిరి(నల్లగొండ): బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అదుపుతప్పి చెట్టును ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామ స్టేజీ వద్ద బుధవారం చోటు చేసుకుంది. కనగల్ ఎస్ఐ పి. విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం ముశంపల్లికి చెందిన తవుడోజు వెంకటాచారి(45) నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌లో నివాసముంటున్నాడు. మర్రిగూడ బైపాస్‌లోని ఓ లాడ్జిలో మేనేజర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన మేనకోడలి వివాహ పత్రికలు పంచేందుకు బుధవారం బైక్‌పై కనగల్ మండలం దర్వేశిపురం వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జి. చెన్నారం గ్రామ స్టేజీ వద్ద బైక్ అదుపుతప్పడంతో రోడ్డు పక్కన చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వెంకటాచారి అక్కడికక్కడే మృతిచెందాడు. సమచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

డివైడర్‌ను ఢీకొని..



అరవింద్‌రెడ్డి (ఫైల్)

వేములపల్లి: రోడ్డు డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన వేములపల్లి మండల శివారులో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన నామిరెడ్డి అరవింద్‌రెడ్డి (25) తన కారులో రాత్రి హైదరాబాద్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో వేములపల్లి మండలం శెట్టిపాలెం శివారులోని చిత్రపరక వాగు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అరవింద్‌రెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో అరవింద్‌రెడ్డి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సరిహద్దు దాటొస్తున్న ఇసుక

- ఆంధ్రా నుంచి మిర్యాలగూడకు లారీల్లో అక్రమంగా తీసుకొచ్చి ఖాళీ స్థలాల్లో డంప్
- రాత్రివేళ కొనసాగుతున్న దందా



ఇటీవల ఆంధ్రా నుంచి వచ్చి మిర్యాలగూడలో పట్టుబడిన ఇసుక లారీ (ఫైల్)

మిర్యాలగూడ: ఆంధ్రాలో ఉచిత ఇసుక పథకం అమలవుతుండడంతో దానిని ఆసరాగా చేసుకున్న కొందరు దళారులు అక్కడి నుంచి ఇసుకను అక్రమంగా తెలంగాణకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాలో ఓ ప్రజాప్రతినిధి కీలకంగా ఉండడంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రాత్రివేళ లారీల్లో పరిమితికి మించి ఇసుకను తరలిస్తూ ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసి అవసరమైన సమయాల్లో లక్షలు ఆర్జిస్తున్నారు.

లారీలు, టిప్పర్లల్లోనే ఇసుక తరలింపు..

తెలంగాణలో ఇసుక డిమాండ్ ఎక్కువగా ఉండడంతో దాన్ని కొందరు వ్యాపారంగా మలుచుకున్నారు. తమకున్న లారీలు, టిప్పర్ల ద్వారా ఏపీ నుంచి అక్రమంగా ఇసుకను మిర్యాలగూడకు తీసుకొచ్చి ఖాళీ స్థలాల్లో డంప్ చేసి అవసరమైన సమయంలో రెట్టింపు ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం మన ఇసుక వాహనం పేరిట ఆన్‌లైన్‌లో ఇసుక బుక్ చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ.. అలా చేస్తే ఇసుక డెలివరీ చేయడానికి చాలా రోజుల సమయం పడుతుండడంతో అవసరమైన వారు ఈ ఇసుక వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే రూ.3970కు వచ్చే ట్రాక్టర్ ఇసుక ఆఫ్‌లైన్‌లో మాత్రం రూ.5000 నుంచి రూ.7వేలకు కొనుగోలు చేయాల్సి వస్తుంది. దీంతో ఏపీ నుంచి టిప్పర్లు, లారీల నుంచి ఇసుకను ఇక్కడకు తీసుకొస్తున్నారు. ఒక్కొక్క లారీలో 30టన్నులు, టిప్పర్‌లో 35టన్నుల ఇసుక పడుతుంది. కానీ వ్యాపారులు ఒక్కొక్క లారీలో 40 నుంచి 50టన్నులు, టిప్పర్‌లో 40 నుంచి 60 టన్నుల చొప్పున పరిమితికి మించి ఇసుకను తీసుకొస్తున్నారు.

నామమాత్రంగా కేసులు నమోదు..

ప్రధానంగా రాష్ట్ర సరిహద్దులో నిఘా లేకపోవడంతో ఈ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. అంతేకాకుండా కృష్ణా నది సరిహద్దు గ్రామాల నుంచి అక్రమంగా పెద్దఎత్తున ఇసుక రవాణా సాగుతోంది. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీలను పోలీసులు పట్టుకుంటున్నా నామమాత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తున్నారే తప్ప.. నియంత్రించేందుకు చర్యలు చేపట్టడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసులు కూడా నమోదు చేస్తున్నారా లేదా అనే అనుమానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆంధ్రా ప్రాంతం నుంచి కూడా ఇసుక రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిస్తే పట్టుకోని కేసులను నమోదుచేస్తాం. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

పట్టుబడుతున్నా ఆగని దందా

మిర్యాలగూడ పట్టణంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టడంలో పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ప్రతిరోజు లారీల కొద్ది ఇసుక మిర్యాలగూడకు తరలివస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. నెల రోజుల క్రితం వంగమర్తి నుంచి మిర్యాలగూడకు ఇసుకతో తరలివస్తున్న మూడు టిప్పర్లను రామచంద్రగూడెం వైజంక్షన్ వద్ద పట్టుకున్నారు. స్థానిక ఇసుక లారీ యజమానులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకుని కేసు నమోదు చేశారు. 20 రోజుల క్రితం హనుమాన్‌పేట వద్ద ఆంధ్రాకు చెందిన ఓ ఇసుక లారీని పట్టుకున్నారు. ఆ విషయంలో పోలీసులు లోతుగా విచారణ చేయగా మిర్యాలగూడకు చెందిన ఓ ప్రజాప్రతినిధికి చెందిన ఐదు లారీలు నడుస్తున్నాయని తెలియడంతో విస్తుపోయారు. ఆ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు కేసు నమోదు చేయకుండానే వదిలేసినట్లు సమాచారం. తాజాగా మంగళవారం మిర్యాలగూడ పట్టణ శివారులోని రైల్వేట్రాక్ వద్ద ఓ ఇసుక లారీని స్థానికులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఆ లారీ ఈ నెల 22న పర్మిట్ పొంది ఉంది. కానీ అందులో ఇసుక మాత్రం 27టన్నులకు గాను 56టన్నులు ఉంది. పరిమితికి మించి ఇసుక ఉండడంతో పాటు స్థానికంగా ఇసుకను డంప్ చేసి అక్రమంగా విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు మిర్యాలగూడ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

సంక్షేమ పాలనలో కేసీఆర్‌ను మించినోడు లేడు

- సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి



లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: ప్రజా సంక్షేమ పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మించినోడు లేడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోటాయన పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసి మాట్లాడారు. కేసీఆర్ పెట్టిన సంక్షేమ పథకాలు ప్రపంచంలోనే మరెక్కడా లేవని అన్నారు. హామీ ఇవ్వని పథకాలును కూడా ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ కేసీఆర్ పథకాలే తప్ప కొత్తగా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న తులం బంగారం ఏమైందని ప్రశ్నించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందరికీ చేరువ చేసింది కేసీఆరేనన్నారు. రైతు భరోసా కాదు.. నేడు వ్యవసాయానికే భరోసా లేకుండాపోయిందన్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయామని ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు.

బాలుడిని అకారణంగా కొట్టిన కానిస్టేబుల్

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాలుడి తల్లిదండ్రులు



గాయాలను చూపుతున్న ప్రవీణ్

ఆత్మకూరు(ఎం): బాలుడిని పోలీస్ కానిస్టేబుల్ అకారణంగా కొట్టిన ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన మజ్జిగ ప్రవీణ్ 9వ తరగతి చదువుతున్నాడు. సోమవారం తమ వ్యవసాయ బావి వద్ద గొర్రెలను మేపుతున్న తన తల్లి విజయకు భోజనం తీసుకుని వెళ్లాడు. వారి భూమి పక్కనే 18 ఎకరాలను ఆత్మకూరు(ఎం) పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లింగంనాయక్ కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. తల్లికి భోజనం తీసుకెళ్లిన ప్రవీణ్‌కు దాహం వేయడంతో లింగంనాయక్‌కు భూమిలోని బోరు మోటారు ఆన్ చేసి బాటిల్‌లో నీళ్లు పట్టుకున్నాడు. అక్కడే మేత మేస్తున్న గొర్రెలు కూడా నీళ్లు తాగడానికి లబీడు పొలంలోకి వచ్చాయి. ఇది గమనించిన లింగంనాయక్ ఆగ్రహంతో ప్రవీణ్‌ను కర్రతో చితకబాదాడు. ప్రవీణ్ తల్లి విజయ అడ్డురాగా ఆమెపై కూడా దాడి చేశాడు. దీంతో వారు కానిస్టేబుల్ లింగంనాయక్‌పై అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఇంతవరకు లింగంనాయక్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని ప్రవీణ్ తండ్రి కనకయ్య, తల్లి విజయ ఆరోపిస్తున్నారు. గాయపడిన ప్రవీణ్‌ను బుధవారం మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశంగౌడ్ పరామర్శించారు. కానిస్టేబుల్ లింగంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని కుర్మ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎస్ఐ ఎస్. కృష్ణయ్యను వివరణ కోరగా.. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని, విచారణ అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బావిలో పడిన ట్రాక్టర్.. డ్రైవర్ మృతి



రమేష్ (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): ట్రాక్టర్ అదుపుతప్పి బావిలో పడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన బుధవారం ఆత్మకూర్(ఎస్) మండలం రామన్నగూడెం గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం బోరింగ్‌తండాకు చెందిన బానోత్ రమేష్(38) నూతనకల్ మండలం గుండ్ల సింగారం గ్రామానికి చెందిన బండారి శ్రీనివాస్ వద్ద మూడేళ్లుగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బండారి శ్రీనివాస్ కర్ర వ్యాపారంతో పాటు బొగ్గు బట్టీ నడిపిస్తున్నాడు. ఇటీవల రామన్నగూడెం గ్రామానికి చెందిన భూరెడ్డి రాంరెడ్డి చెలకలో పలు రకాల చెట్లను బండారి శ్రీనివాస్ కొనుగోలు చేయగా.. వాటిని బొగ్గు బట్టీకి తీసుకెళ్లడానికి బుధవారం ఉదయం అరుగురు కూలీలతో పాటు రమేష్ ట్రాక్టర్‌లో అక్కడకు వెళ్లారు. కూలీలు చెట్లను కోస్తుండడంతో రమేష్ ట్రాక్టర్‌ను పక్కకు పెడుతుండగా ట్రాక్టర్ అదుపుతప్పి దాదాపు 100 మీటర్ల దూరంలో గల బొర్రాజ మల్లయ్యకు చెందిన వ్యవసాయ బావిలో పడిపోయింది. బావి తోతుగా, నీళ్లు ఎక్కువగా ఉండటంతో ట్రాక్టర్‌తో పాటు రమేష్ పూర్తిగా బావిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని రెండు మోటార్ల సహాయంతో బావిలోని నీటిని బయటకు తొలగించి రమేష్ మృతదేహాన్ని, ట్రాక్టర్‌ను బయటకు తీశారు. మృతుడికి ఇద్దరు భార్య, కుమారులు ఉన్నారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జానకిరాములు తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాన్ని నిమిత్తం సూర్యాపేట ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం రోజునే..

బానోత్ రమేష్ ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాలపురం పాఠశాలలో 2003లో పదో తరగతి పూర్తి చేయగా.. మిత్రులందరూ కలిసి బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. చిన్ననాటి మిత్రులందరినీ కలుసుకోవాలని తొందరగా పని ముగించుకొస్తానని ఇంటి వద్ద చెప్పి వెళ్లిన రమేష్ తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులతో పాటు పదో తరగతి మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

ప్రసాద తయారీ కేంద్రంలో చింతపండు చోరీ

- యాదగిరిగుట్ట ఆలయం నుంచి కొండ కిందకు కారులో బస్తాలు తీసుకెళ్తుండగా ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- నిందితులు ఆలయ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తింపు



యాదగిరిగుట్ట పైన కారులో తీసుకెళ్తున్న చింతపండు బస్తాలను పట్టుకున్న పోలీసులు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట పైన చింతపండు బస్తాలను ఆలయ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు దొంగతనానికి పాల్పడిన ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. యాదగిరిగుట్ట పైన ఉన్న ప్రసాదాల తయారీ కేంద్రానికి సంబంధించిన గోదాం నుంచి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు 9 చింతపండు బస్తాలను (సుమారు 3క్వింటాళ్లు) గోదాంలో ఉన్న కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తీసుకొచ్చారు. ఈ బస్తాలను కారులో పెట్టి కొండ కిందకు తరలించే ఏర్పాట్లు చేస్తుండగా.. పోలీస్ పెట్రోలింగ్ వాహనం రావడంతో ఇద్దరు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు పట్టుకున్నారు. వారిద్దరు ప్రసాద విక్రయశాల విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సీహెచ్. గణేష్, పులిహోర మిషన్ ఆపరేటర్ పి. మధుగా గుర్తించి యాదగిరిగుట్ట పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షోకాజ్ నోటీసులు జారీచేసిన ఈఓ..

చింతపండు బస్తాలు దొంగతనం జరిగిన విషయంపై ఈఓ ఎస్. వెంకట్రావ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రసాదాల తయారీ గుమాస్తా పులిపాక నవీన్, పర్యవేక్షకుడు సత్యనారాయణకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పేర్లు చెప్పొద్దని భయపెడుతున్నారు

చింతపండు దొంగతనంలో తమ పేర్లు చెప్పొద్దని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులైన మధు, గణేష్‌ను కొందరు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వారి కుటుంబ సభ్యులు మీడియాకు తెలిపారు. ఆలయానికి చెందిన పంతుళ్లు క్రిష్ణమాచార్యులు (కన్నయ్య), సంతోష్ ప్రసాద విక్రయశాల విభాగం నుంచి చింతపండు తీసుకరమ్మని మధు, గణేష్‌కు సూచించారని వారి కుటుంబ సభ్యులు వెల్లడించారు. తమ పేర్లు చెప్పొద్దని రఘు అనే ఉన్నతాధికారి భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

పర్యవేక్షణ లోపం..

చింతపండు బస్తాలను తీసుకెళ్లడానికి కొండపైకి వెళ్లిన కారును ఏ విధంగా పైకి అనుమతించారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారు ఎవరి రిఫరెన్స్‌తో కొండ పైకి వెళ్లిందనే విషయం ఆలయ అధికారులు చెప్పడం లేదు. అదేవిధంగా ప్రసాద విక్రయశాల విభాగంలో విలువైన సామగ్రి ఉన్నా తాళాలు లేకపోవడం ఆలయ అధికారుల నిర్లక్ష్యం, భద్రతా లోపం స్పష్టంగా కనబడుతోంది.

హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా

గరిడేపల్లి: గడ్డిపల్లిలోని హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం కళాశాల సెక్రటరీ డాక్టర్ ఎం. స్నేహలత ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జెన్‌రెస్ట్ కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వారికి నెలకు రూ.23వేలు వేతనంగా కంపెనీ వారు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఘంటా సత్యనారాయణరెడ్డి, బండి వెంకటేశ్వర రావు, జెన్‌రెస్ట్ సంస్థ ప్రతినిధులు సోముబాల చవడారెడ్డి, జోనల్ హెడ్ సాయి, రీజనల్ మార్కెటింగ్ మేనేజర్, కాలేజీ ఇన్‌చార్జి శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం



నడిగూడెం: సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న ప్రిన్సిపాల్ వాణి

నడిగూడెం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 100శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రాం సంక్షేమ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి ఉత్తమ పురస్కారం అందుకున్నారు.

నారమ్మగూడెం వాసికి ప్రోత్సాహక బహుమతి

నిడమనూరు: అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న నిడమనూరు మండలం నారమ్మగూడేనికి చెందిన ఎక్కలూరి నక్షత్రారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతి అందుకుంది. డిండి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నక్షత్రారెడ్డి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో బంగారు పతకం, సీఎం కప్‌లో 400 మీటర్ల పరుగుపందెంలో తృతీయ స్థానం, సూర్యాపేటలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌లో ప్రథమ స్థానం సాధించింది. నక్షత్రారెడ్డిని నారమ్మగూడెం మాజీ సర్పంచ్ దుబ్బాకుల రాంరెడ్డి, స్థానిక నాయకులు తులసీరెడ్డి, గోవింద్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు అభినందించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ.. ఇద్దరు దుర్మరణం



ఘటనా స్థలంలో శ్రీశైలం మృతదేహం

దేవరకొండ: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. ఈ ఘటన బుధవారం దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలానికి చెందిన ఈడమోని శ్రీశైలం(44), అదే జిల్లా ఊరుకొండ మండలం రాచాలపల్లి గ్రామానికి చెందిన ఈరెటి బచ్చయ్య(40) వరుసకు బంధువులు. శ్రీశైలం, బచ్చయ్య వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరిద్దరు కలిసి పశువులను కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై మంగళవారం మిర్యాలగూడకు వచ్చారు. త్రిపురారం వద్ద వారికి అవసరమైన పశువులను కొనుగోలు చేశారు. రాత్రి కావడంతో అక్కడే బసచేసి బుధవారం ఉదయం స్వగ్రామాలకు బయల్దేరారు. ఉదయం 7గంటల ప్రాంతంలో దేవరకొండ పట్టణంలోని మనోజ్ థియేటర్ సమీపంలోకి రాగానే కొండమల్లేపల్లి నుంచి ఐరన్ లోడ్‌తో కల్వకుర్తి వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీశైలం, బచ్చయ్య తీవ్రంగా గాయపడ్డారు. శ్రీశైలం అక్కడికక్కడే మృతిచెందగా.. బచ్చయ్యను చికిత్స నిమిత్తం నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. దేవరకొండ సీఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడు శ్రీశైలం కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రైవేట్ బస్సును ఢీకొట్టిన డీసీఎం

- బస్సు క్లీనర్ మృతి

నకిరేకల్: ఆగి ఉన్న ప్రైవేట్ బస్సును డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు క్లీనర్ మృతిచెందాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణ శివారులోని పద్మానగర్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్మీస్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ నుంచి హైదరాబాద్‌కు మంగళవారం రాత్రి 8గంటలకు బయల్దేరింది. బుధవారం తెల్లవారుజామున 5.30గంటల సమీపంలో నకిరేకల్ పట్టణంలోని పద్మానగర్ జంక్షన్ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి పక్కన ఇద్దరు ప్రయాణికులను దింపేందుకు డ్రైవర్ బస్సును ఆపాడు. ఛత్తీస్‌గఢ్‌లోని బిలీసాపూర్‌కు చెందిన బస్సు క్లీనర్ చరణ్‌దాస్(36) బస్సు వెనుక డిక్కీలో ఉన్న లగేజీని తీస్తుండగా.. విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చరణ్‌దాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో అతడిని నకిరేకల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లిలోని కామినేని వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. బస్సు డ్రైవర్ రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రిష్టాచారి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం చరణ్‌దాస్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఎంజీయూ డిగ్రీ బ్యాక్‌లాగ్ ఫలితాలు విడుదల

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల్లో గతంలో డిగ్రీ అభ్యసించి ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు చిట్టచివరిగా అవకాశం కల్పించి మార్చి, ఏప్రిల్ నెలల్లో పరీక్షలు నిర్వహించారు. ఈ బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు ఎంజీయూ సీఈఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

ఇక్కత్ వస్త్రాలు మా మనసు దోచాయి..



టూరిజం పార్కులో రాట్నం వడుకుతున్న ఆఫ్రికన్ యువతి



మగ్గాలను పరిశీలిస్తున్న ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు

- పోచంపల్లిని సందర్శించిన ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు



కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌లో చిటికి కట్టి మురిసిపోతున్న ఆఫ్రికన్ యువతి



సెల్ఫీ తీసుకుంటున్న కంటెంట్ క్రియేటర్లు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు తమ మనసును దోచాయని ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు కొనియాడారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో ఐదు రోజుల పర్యటనలో భాగంగా మధ్య, పశ్చిమ ఆఫ్రికన్ దేశాలకు చెందిన 30 మంది సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్లు బుధవారం పోచంపల్లిని సందర్శించారు. స్థానిక టూరిజం పార్కు, కళాపునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌తో పాటు చేనేత వస్త్రాలను తయారీని పరిశీలించారు. మగ్గం నేసి, రాట్నం వడికి సందడి చేశారు. ఇక్కత్ వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సమాచార అసిస్టెంట్ డైరెక్టర్ మామిండ్ల దశరథ మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలు, కళలు, ప్రజల ఆచార వ్యవహారాలు తెలుసుకునేందుకు ఆఫ్రికన్ దేశాలకు చెందిన కంటెంట్ క్రియేటర్లు ఇక్కడికి వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, చేనేత, జౌళిశాఖ ఏడీ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, డీపీఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా మూలాలు మరువలేదు

– యోవానీ నాయుడు, దక్షిణాఫ్రికా క్రియేటర్

మా నాన్న తెలుగు వారు, మా అమ్మ తమిళనాడుకు చెందినవారు. మా పూర్వీకులు శతాబ్దాల క్రితం దక్షిణాఫ్రికాకు వలస వెళ్లారు. భౌతికంగా ఇండియాకు దూరమైనా ఇక్కడి మూలాలు మరువలేదు. నాకు తెలుగు, తమిళం రాకున్నా భారత సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నాను.